# వెయ్యిన్నొకటి

"అన్నా, నువు చెప్పేదాన్నిబట్టి స్వర్గం గురించి నేను విన్నదంతా అబద్ధమే నన్నమాట!" అన్నాడు 123, చుట్టూ ఉన్న బొగ్గుగుట్టలు కలియజూస్తూ.

వెయ్యిన్నొకటి ఆఖరు నూనెపీపా నింపటం పూర్తిచేసి, దానిమీద మూతపెట్టి, చేతులు పీచుతో తుడుచుకుంటూ, "నువు ఏం విన్నావేం?" అని నవ్వుతూ అడిగాడు.

"న్యాయాన్యాయాల తూకం నరకం లోనే స్ట్రిక్టుగా నిర్ణయమవుతుందనీ, స్వర్గంలో మనుషులు తాగి తందనాలాడటమూ, అమ్మాయిలతో భోగించటమూ తప్ప ఇంకేమీ ఉండదనీ–"

వెయ్యిన్నొకటి తల ఎత్తి 123 కళ్ళలోకి నిదానంగా చూసి, "ఆ అబద్ధపు ప్రచారం ఎందుకు జరుగుతున్నదీ ఊహించలేదా? ఇన్నేళ్ళుగా మెసెంజరు పనిచేస్తున్నావుగదా, భూలోకంలో పరిస్థితులు నీకు తెలుసుగదా. నువు స్వర్గం గురించి విన్నది భూలోకంలో అక్షరాలా అమలు చేసుకోగల వాళ్ళున్న సంగతి ఎరగవా?" అని అడిగాడు.

"ఎవరు వాళ్ళు?"

"ఇంకెవరు? డబ్బున్నవాళ్ళు – డబ్బు పుష్కలంగా సంపాదించగలవాళ్ళు! తింటారు, తాగుతారు, అందమైన అమ్మాయిలను వెంటేసుకు తిరుగుతారు. శ్రమపడరు, న్యాయధర్మసూత్రాలు వాళ్ళను అంటవు. వాళ్ళ జీవితమే స్వర్గం!"

"అదా సంగతి?" అన్నాడు 123 ఆశ్చర్యంగా.

"నరకం కూడా భూలోకంలో కటిక దరిద్రులు అనుభవిస్తున్న జీవితమేనని ప్రచారం చేశారు. స్వర్గ నరకాలకు డబ్బుతో ఉన్న సంబంధం దాచి పెట్టటానికి పాప పుణ్యాలు కల్పించారు. ధనికులు ఎందుకు స్వేచ్ఛగా, ఏ లోటూ లేకుండా తాగి తందనాలాడ గలుగుతున్నారు? భూలోకంలో డబ్బువల్లకావచ్చు, కాని స్వర్గంలో అంతకు నూరింతలు తాగితందనాలాడగలరు! ఎలా? పుణ్యం సంపాదించి. అదేవిధంగా దరిద్రులు భూలోకంలో పడే కష్టాలకన్న వెయ్యిరెట్లు నరకంలో పడటానికి కారణం డబ్బు లేకపోవటంకాదు, పుణ్యం చేసుకోకపోవటం! ఈ దగా ప్రచారాన్ని నువు కూడా నమ్మావు... అప్పటికీ కొందరు అవివేకులు నిజం బయటపెట్టారు; డబ్బు లేకుండా పుణ్యం చెయ్యటం సాధ్యంకాదనీ,

డబ్బున్నవాళ్ళే జన్మ జన్మలకీ డబ్బున్నవాళ్ళుగా పుట్టి, ప్రతి జన్మలోనూ పుణ్యంచేసి, స్వర్గం అనుభవిస్తూంటారనీ, దరిద్రులకు ఎన్ని జన్మలు గడిచినా దారిద్ర్యమూ, నరకమూ తప్పదనీ – ”

“మరి మనం నరకానికి తెస్తున్నది పాపాత్ములను కాదా?”

“కాదు, దరిద్రుల్ని.”

“అయితే స్వర్గానికి పోతున్నది డబ్బున్నవాళ్ళా?”

“కాదు. దారిద్ర్యం నుంచి విముక్తి పొందినవాళ్ళు. డబ్బున్నవాళ్ళు కూడా నరకానికి వస్తున్నారు. నువు కోటీశ్వరులను నరకానికి తెస్తున్నావు కావా?”

“అవును. అందుకే నాకు నువు చెప్పిన అబద్ధపు ప్రచారం అర్థం కావటంలేదు.”

“స్వర్గంలో ఉండేది ఎవరో తెలిస్తే నీకు అంతా అర్థమయేది. అక్కడ ఉన్నవాళ్ళు దాదాపు అందరూ భూలోకంలో దరిద్రులే. భూలోకంలో ఉన్న నరకాన్ని ప్రతిఘటించి పోరాడి జయించిన వాళ్ళే! నిజంగా పుణ్యం చేసుకున్నవాళ్ళు.

“అవును, పుణ్యమంటే ఇతరులకు ఉపకారం చెయ్యటమని విన్నాను... అన్నా, నువు చెప్పేది నిజమైతే, ఇంతకాలమూ నేను అబద్ధాలు ఎందుకు నమ్మాను?”

“నిన్ను అందరూ బుద్ధిమంతుడని ఎందుకంటారూ? నేనంటే అధికార్లకు మంటదేనికీ? అందుకే! నిజం తెలిసిన వాళ్ళవల్ల ప్రమాదం ఉంది. నరకంలో మరింత ప్రమాదం. స్వర్గంలో నిజం తెలిసినవాడికి గౌరవం హెచ్చు. ఇక్కడ అదేమీ లేదు. ఇక్కడ పవిత్రత శిక్ష పొందటం ద్వారా వస్తుందని ఒక మూఢ నమ్మకం ఉన్నది. అమిత దారుణమైన శిక్షలు అనుభవిస్తున్న వాళ్ళున్నారు. శిక్ష అనుభవించి పవిత్రులై స్వర్గానికి వెళ్ళినవాణ్ణి ఒకణ్ణి కూడా నేను చూడలేదు.”

“ఇక్కడ యాతన అనుభవించినవాళ్ళు ఏమవుతారు?”

“ఇంకేమవుతారూ? ఆ పిచ్చి బ్రాహ్మడు బయటపెట్టేసినట్టు తిరిగి భూమ్మీద దరిద్రులుగా పుడతారు. నీబోటి పిచ్చివాళ్ళేమో, స్వర్గంలో జీవితం నిరర్థకమనీ, నరకంలోనే ధర్మం నాలుగుపాదాలా నడిపించబడుతుందనీ, మీ యముణ్ణిమించిన ధర్మరాజూ, చిత్ర గుప్తుణ్ణి మించిన ఆడిటర్ జనరలూ లేడనీ నమ్మేస్తారు. బ్రహ్మసృష్టికి మెరుగులు దిద్దే కార్యక్రమం యావత్తూ నరకమనే ఈ రిపేరు కార్ఖానాలోనే సాధ్యమని నీబోటి వాళ్ళ నమ్మకం. కాని ఒక దశలో సృష్టిలో అందరూ పుణ్యాత్ములే అయిపోయి, భూలోకంలో ధనానికి అతీతమైన జీవితం ఏర్పడి, నరకానికి ఎవరూ రాకపోతే మీ యముడు సంతోషించాడా? లేదే! దేవతల దగ్గిరికి వెళ్ళి, లబోమని ఏడ్చి, భూలోకంలో పాపం పెరిగే పద్ధతి చూడమన్నాడు. అప్పుడు కొందరు యముడి ఫ్రెండ్స్ గబగబా స్మృతులు

రాశారు. రాజనీతి యావత్తూ శిక్షాస్మృతిమీద నిర్మించారు. వాటి ప్రకారం ఏ ప్రాణిగాని పాపం చెయ్యకుండా ఉండటం సాధ్యంకాదు. స్వర్గం పాడుబడిపోయింది. ఎవడన్నా విచారించాడా? లేదు!"

"ధర్మశాస్త్రాలూ, స్మృతులూ రాసినవాళ్ళు స్వర్గంలోనేగదా ఉంటారు?" అని 123 అడిగాడు.

వెయ్యిన్నొకటి విరగబడి నవ్వాడు.

"వాళ్ళు నరకంలో తిష్టవేసుక్కూచోకపోతే ఈ నరకం ఎప్పుడో దిబ్బేసిపోయేది. లేదు. తమ్ముడూ! ఆ మహాపురుషులందరూ నరకంలోనే ఉన్నారు. యాతనలు అనుభవించారు. వాళ్ళుండే ఛాయలకు నీ బోటి, నా బోటివాళ్ళు పోవటానిక్కూడా లేదు."

"అయితే వాళ్ళసంగతి నీకెట్లా తెలుసు?"

"వాళ్ళు మధ్య మధ్య వచ్చి తనిఖీ చేస్తుంటారు. వాళ్ళకున్న ఒక్క అదురూ ఏమిటంటే ఈ నరకం తుడిచిపెట్టుకు పోతుందేమోనని! ఇది పోతే వాళ్ళకు నిలువ నీడలేదు. అంతరించిపోయి మోక్షం పొందుతారు."

కింకరుడు 123 ఆశ్చర్యపోతూ, "మోక్షమంటే వాళ్ళకిష్టమేగదా!" అన్నాడు.

"ఇంకా నయం! మోక్షమంటే ఎవడికిష్టం ఉంటుంది. నిన్ను ఎవరన్నా లేకుండా చేస్తామంటే నువు ఒప్పుకుంటావా? ఈ నరకంలోకి వచ్చేవాళ్ళకు సగం తృప్తి ఏమిటి? నరకం అయితే అయింది. ఏదో విధంగా తామింకా ఉన్నామనికాదా? నరకంలో యాతనపడుతున్నవాడు కూడా మోక్షం కోరడు గదా. ఇక్కడ అధికారం చలాయించే గడ్డాలవాళ్ళు మోక్షం కోరుతారా? వాళ్ళు తాము రాసిన ధర్మశాస్త్రాలు కొంచెం అమలు జరక్కపోతే ఎంత పంచాయితీ చేస్తారో నీకేం తెలుసు? పేరుకు ఇది యముడి రాజ్యంగానీ అసలు అధికారం స్మృతికారులదే. వాళ్ళు ఎంతమంది యముళ్ళను మార్చారుకారు?"

123 కు అంతా అయోమయంగా ఉంది. వాడు నాలుగురోజుల శలవుమీద ఉన్నాడు. వెయ్యిన్నొకటితో తాపీగా మాట్లాడటానికి దొరికిన మొదటి అవకాశం ఇదే. వెయ్యిన్నొకటి చెప్పే విషయాలు కింకరుడికి కొత్తవి కావటమే గాక, వాడు వీధి బడిలో విన్నవాటికి చాలా విరుద్ధంగా ఉన్నాయి. అంతేకాదు, వెయ్యిన్నొకటి చెప్పేవే ఒకదానికొకటి అతుకుతున్నట్లు కనిపించలేదు.

"చూడు, అన్నా! స్వర్గంలో అందరూ దరిద్రులే అన్నావు. దరిద్రులే నరకంలో యాతనలనుభవించే వాళ్ళన్నావు. ఏమిటి తేడా?" అని వాడు అడిగాడు.

"స్వర్గంలో వాళ్ళు దారిద్ర్యాన్ని జయించినవాళ్ళు, ధనంమీద విప్లవం చేసినవాళ్ళు. ఇక్కడికి వచ్చేవాళ్ళు ధనబంధాలనుంచి విముక్తి చెందలేనివాళ్ళు. పాపం అంటే అదే –

ధనపు ఉచ్చులనుంచి బయటపడలేకపోవటం. పాపులలో కోటీశ్వరులు కూడా ఉంటారుగద."

"వాళ్ళు నరకయాతనలు అనుభవిస్తున్నారా?"

"లేదు. వాళ్ళను స్మృతికర్తలు కాపాడుతున్నారు. వాళ్ళు ఏ పనులు చేస్తే పుణ్యం వస్తుందో ఈ గడ్డాలవాళ్ళు చెప్పి ఉన్నారుగా - దానాలూ, ధర్మాలూ, యజ్ఞాలూ - ఇవి ధనికులకు స్వర్గాన్ని ఇయ్యలేవు, కాని నరకంలో ఏర్‌కండిషనింగ్ లాంటి సౌకర్యాలు కలిగిస్తాయి."

"నువు కూడా విప్లవం చేసినవాడివేగదా, ఇక్కడెందుకు దీర్ఘ శిక్ష పొందుతున్నావు?" అని 123 అడిగాడు.

"నాకు విప్లవం చెయ్యడం చేతకాలేదు. సరి అయిన నాయకత్వం లేదు. నా అజ్ఞానంతో కొన్ని లక్షలమంది విప్లవ కృషి నీరుకారిపోయింది. నాకు ఇప్పుడు స్వర్గం వెళ్ళాలన్న కోరికలేదు - ఈ నరకాన్ని తుడిచిపెట్టాలన్న కోరిక తప్ప ఇంకేమీ లేదు. ఈసారి నాకు పరాజయం లేదు. నరక శాఖలన్నీ పాడు పెట్టేసి, గడ్డం వాళ్ళకందరికీ మోక్షం ఇప్పిస్తాను. నరక జ్వాలల్లో ప్రచురణ కాలేవు వాళ్ళ పుస్తకాలు!" అన్నాడు వెయ్యిన్నొకటి పిడికిళ్ళు బిగబట్టి.

* * * * *

ఆ వేళ కింకరుడు 123 కొందరు విప్లవకారులను తీసుకురావటానికి వెళ్ళాడు. వాళ్ళ కోసం దేవదూత కూడా వచ్చాడు. అలా అప్పుడప్పుడూ జరగటం కద్దు.

"వీళ్ళు స్వర్గానికి వస్తున్నారు" అన్నాడు దేవదూత కింకరుడితో.

"వీళ్ళవల్ల ఎవరికన్నా మేలు జరిగితే, పోనీ, నువ్వన్నట్టు–"

"వీళ్ళది వీర మరణం! హత్యాశాప్రాప్స్యసే స్వర్గం అని గీతలో రాసిన దొంగ బ్రాహ్మడు మీ నరకంలోనే ఉన్నాడు. కావలిస్తే అడుగు" అన్నాడు దేవదూత.

కింకరుడు 123 తన డ్యూటీ మానటం ఇష్టం లేక చచ్చినవాళ్ళ పాశాలు అందుకోబోయాడు. చెయ్యి షాక్ తిన్నది. దేవదూత విరగబడి నవ్వి, వాళ్ళను తీసుకుపోయాడు.

కింకరుడు ఉత్త చేతులతో రావటం చూసి చిత్రగుప్తుడు, "ఏరా? ఏరీవాళ్ళూ?" అని అడిగాడు.

"స్వర్గానికి వెళ్ళారు."

"భయపడుతూనే ఉన్నా. నువ్వీ మధ్య బొత్తిగా అసమర్థుడివై పోతున్నావు. ఆ వెయ్యిన్నొకటితో తెగ తిరుగుతున్నావటగా? వాడు పాపి, విజాతీయుడు, శిక్ష పొందుతున్నవాడు. సాంకేతిక నైపుణ్యం గలవాడని వాణ్ణి కూపాలలోనుంచి తీసి, ఇంధనాల తయారీకి పెట్టాం. బొగ్గులూ, తైలాలూ వాడికి గారడీలాగా చేతికందుతాయి. గాలిలో బూడిద తీసే బాబా గురించి విన్నావా? వెయ్యిన్నొకటి స్పీడు ముందర బాబా స్పీడు ఎక్కడా చాలదు. చెప్పొచ్చిందేమంటే నువు వాడితో అతిగా పూసుకోకు. నీచేత శాస్త్రగ్రంథాలు పడ చదివించాం. ఏం లాభం? దేవదూత నిన్ను మాటలతో మస్కా చేశాడు. వాడితో వాదించలేక నిక్షేపాలలాంటి నూటయాభై జీవులను వాడికి ధారపోసేశావు! ఇంకా వేల సంఖ్యలో అలాటి జీవులు రాబోతున్నారు. ఇలా అయితే నువు డ్యూటీ చేసినట్టే!" అన్నాడు చిత్రగుప్తుడు లిస్టులు తిరగేస్తూ.

"నన్ను మెసెంజరుగా మాన్పించి, స్టోకరుగా బదిలీ చెయ్యమని ఏనాడో అర్జీ పెట్టుకున్నాను. అర్జీ చూడటానికే ఆర్నెల్లాయె. దానిమీద పెద్దాయన సంతకాలు పెట్టాలి. గడ్డాలవాళ్ళు సంతకాలు పెట్టాలి!.... నేను చదివిన ధర్మశాస్త్రాలే ఆ దేవదూత చదివాడు. ఆ దొంగ బ్రాహ్మడు రాసిన గీతలో వీర మరణం పొందినవాళ్ళు స్వర్గానికి పోతారని ఉందిట!" అన్నాడు 123.

చిత్రగుప్తుడు అరచేత్తో నుదురు కొట్టుకుని, "ఖర్మా ఖర్మ! గీతే కాదురా, బాబూ. విప్లవకారులను స్వర్గానికి పంపే సూత్రాలు సవాలక్ష గ్రంథాలలో ఉన్నాయి. వాటిలో ఏమున్నదీ మనుషులు చదవకుండానూ, చదివినవాళ్ళకు మాయ కమ్మి అర్థంకాకుండానూ చూస్తున్నామంటారు రుషులు. అహింసావాదులందరినీ రామ భక్తులను చేశాంకాదూ, నీతిమంతులూ, పాపభీతిగలవాళ్ళూ కృష్ణుణ్ణి ఆరాధిస్తున్నారు కాదూ అంటారు. కాని ప్రజల మౌఢ్యం మీద ఎంతకాలం ఆధారపడతాం? ముఖ్యంగా గీతను కొందరు గడుసు వెధవలు మహా యుక్తిగా మనకు వ్యతిరేకంగా వాడుకుంటున్నారు. దాన్ని నిషేధించండ్రా అంటే, అయ్యో, దానితో బోలెడంత పని ఉన్నదంటారు. తపోలోకానికి కబురుచేసి, విప్లవానుకూల పవిత్ర రచన సంగతి తాడోపేడో తేల్చేసుకుంటాను. పెద్దాయనకి మొహమాటం! నాకేం భయం? జీతగాణ్ణి" అన్నాడు.

"తపోలోకం కూడా మన నరకంలో ఒక పేటేటగా?" అన్నాడు 123.

చిత్రగుప్తుడు గబుక్కుమని, "నీకెవరు చెప్పారు? నువుగాని అటు వెళ్ళలేదుగదా?" అన్నాడు.

"నాకంత తీరిక కూడానా? వెళ్ళగూడదా?"

"సందర్భం వచ్చిందిగనక తెలుసుకో. తపోలోకం పూర్తిగా నరకానికి చెందదు.

అక్కడ మన పరిపాలన సాగదు. అది మునులుండే కాలనీ. అక్కడ వాళ్ళకు ఎక్స్ట్రా టెరిటోరియల్ రైట్స్ ఉన్నాయి. అందుచేత..."

చిత్రగుప్తుడు వాక్యం పూర్తి చెయ్యదలచలేదు.

"ఈ గడ్డాలవాళ్ళు స్వర్గానికి పోలేరుట, నిజమేనా?"

"ఎవరా చెప్పింది?"

"వెయ్యిన్నొకటి."

"అనుకుంటూనే ఉన్నా! ఇంద్రుడి కొలువులో ఉండే మహర్షులంతా ఎవరుట?"

"వాళ్ళు పుణ్యాత్ములుట. వాళ్ళు ఇక్కడికి రారుట. వీళ్ళు అక్కడికి పోరుట."

చిత్రగుప్తుడు రహస్యంగా, "నేనూ అలాటిదేదో విన్నానుగాని, ఈ మాటలు పైకి అనవలసినవికావు. అరాచకం ఎక్కడ వచ్చినా నరకంలో మాత్రం రారాదు. తెలిసిందా? ఈ వెయ్యిన్నొకటిని ఏం చెయ్యాలో తోచలేదు. వాడి పీనల్ సర్విట్యూడ్ ఇంకా చాలా వేల ఏళ్లున్నది. ఆ మాట ఇక్కడ అందరికీ తెలుసు. అందుచేత, వాణ్ణి పంపే..." అని అంతటితో వదిలేశాడు.

"బాబూ, కొంతకాలానికి ఈ నరకం దిబ్బేసిపోయి, ఇక్కడ ఆర్కియాలజిస్టులు పరిశోధనలకు వస్తారటగా?" అన్నాడు 123 చిన్నగా.

"నరకం ఒకప్పుడు లేదు. ఎప్పటికైనా లేకుండా పోవచ్చు. పుట్టినదల్లా గిట్టుతుంది. కాని మనకెందుకు బెంగ! మన హయాంలో అది జరగదు" అన్నాడు చిత్రగుప్తుడు.

"కాని, గుప్తాగారూ, అది మనం అనుకున్నంత దూరంలో లేదుట."

"వెయ్యిన్నొకటే అన్నాడా ఆ మాటకూడా?"

"అనటం వెయ్యిన్నొకటి అంటేనేం? లక్షన్నొక్కమంది నరకవాసులు ఆ మాట నమ్ముతున్నారు. మనం పవిత్ర గ్రంథాలని పూజించే పుస్తకాలమీద వెయ్యిన్నొక్కటి భాష్యాలు చెప్పి, వాటిలో ఉన్న నిజం అందరికీ చెప్పేస్తున్నాడు."

❀ ❀ ❀ ❀ ❀

వెయ్యిన్నొకటి చుట్టూ ఒక పాతికమంది "పాపులు" ఉన్నారు. అందరూ అతని శిష్యులే.

"విప్లవం మనం అనుకున్నంత దూరంలో లేదు" అన్నాడు 2222.

1001 నవ్వి, "ఈ మాట మనవాళ్ళు చాలామంది అంటున్నారట. మనం ఎంత దూరంలో విప్లవం ఉన్నదనుకుంటున్నాం?" అని అడిగాడు.

"గోముకంలో ఉన్న చిల్లర మునులు మన పక్షానికి వచ్చేస్తున్నారు. రహస్య వార్తలు వొస్తున్నాయి," అన్నాడు 2222 తనను తాను సమర్థించుకుంటూ.

"వాళ్ళను నమ్మను. వాళ్ళు నరకంలోనే ఉన్నా నరక జీవితం వాళ్ళకు తెలీదు. తపోలోకం వాళ్ళ జీవితం మీదనే వాళ్ళ లక్ష్యం. అది అందితే వాళ్ళ విప్లవం పూర్తి అయిపోతుంది. తపోలోకాలూ, గోముకాలూ, సువర్లోకాలూ తుడిచిపెట్టేస్తేగాని మన విప్లవం పూర్తికాదు. ఇటువంటి ఔత్సాహిక విప్లవకారులను మనం నిరుత్సాహపరచంగాని వారి సహాయం మనకు అవసరంలేదు. మనవాళ్ళు కొందరు అప్పుడే నరకం నిర్మూలమైనట్టూ, తాము అప్పుడే స్వర్గంలో ఉంటున్నట్టూ మాట్లాడుతున్నారు. ఇది పొరపాటు. ఈ నరకంలోనే పుట్టి పెరిగిన వాళ్ళు నరకమే స్వర్గమనీ, స్వర్గంకన్నా ఇదే చాలా గొప్పచోటనీ అనుకుని భ్రమపడుతున్నారు. మనం కూడా అటువంటి భ్రమే పడితే వాళ్ళకూ, మనకూ తేడా ఏమిటీ?... అదీ గాక మనది రహస్య విప్లవం కాదు. మనం భూమి మీది మనుషులంకాము. ఇది బహిరంగంగా, ఉపజ్ఞతో సాగవలసిన విప్లవం. సిద్ధాంతబలం తప్ప మనకు వేరే దారి లేదు. వాళ్ళు మనని చంపలేరు, మనం వాళ్ళని చంపలేం. మనం చూసేది వాళ్ళ చచ్చు, మూఢ, అక్రమ సిద్ధాంతాలను. వాటిని నరకవాసులు త్యజించిన తరవాత ఇదే స్వర్గమవుతుంది" అన్నాడు 1001.

"రెండూ, రెండు వేరు వేరు స్వర్గాలవుతాయేమో?" అన్నారు ఎవరో.

"అయితే కానీ! ఘర్షణ మరో రూపం పొందుతుంది. విప్లవకారులు ఘర్షణలో జీవించటానికి వెనకాడతారా? ఘర్షణ లేకుండా జీవించటం జీవితం ఎప్పుడన్నా అవుతుందా?" అన్నాడు 1001.

అతని శిష్యుల్లో కొందరికి ఈ సంగతి తెలీదు. వాళ్ళు తాము ఘర్షణ పడుతున్నది ఘర్షణ అవసరం లేని స్థితి కోసం అనుకుంటున్నారు! అది పొరపాటన్న మాట!

*రచన: డిసెంబర్ 1978*

*ముద్రణ: కొడవటిగంటి కుటుంబరావు కథలు, ఆరవ సంపుటం, డిసెంబర్ 1994*

*విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్*